సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023

నేడు మున్సిపల్ కమిషనర్లతో సాక్షి ఫోన్ ఇన్

వేములవాడ
సమయం : శుక్రవారం ఉదయం
10.30 నుంచి 11.30 గంటల వరకు
ఫోన్ నంబర్ : **70366 64716**
అంశం : వేములవాడ పట్టణంలో పారిశుధ్య పరిస్థితి. దోమలు, వ్యాధుల తీవ్రత


అన్వేశ్, వేములవాడ, కమిషనర్

సిరిసిల్ల
సమయం : శుక్రవారం
ఉదయం 9.30 నుంచి
10.00 గంటల వరకు
ఫోన్ నంబర్ : **98499 05879**
అంశం : సిరిసిల్లలోని పారిశుధ్య పరిస్థితి. దోమలు, వ్యాధుల తీవ్రత.


ఆయాజ్, సిరిసిల్ల కమిషనర్

న్యూస్‌రీల్

రాజన్న సేవలో గౌతమ్‌రెడ్డి



వేములవాడ: రాజన్నను జిల్లా ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి గురువారం దర్శించుకున్నారు. అర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించారు. పర్యవేక్షకులు తిరుపతిరావు ఉన్నారు.

దంచికొట్టిన వాన



సిరిసిల్ల: జిల్లాలో గురువారం తెల్లవారుజామున వర్షం దంచికొట్టింది. ఎల్లారెడ్డిపేటలో అత్యధికంగా 105.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా బోయినపల్లిలో 4.1 మిల్లీమీటర్లు కురిసింది. రుద్రంగిలో 8.5, చందుర్తిలో 5.3, వేములవాడ రూరల్‌లో 7.7, వేములవాడలో 6.4, సిరిసిల్లలో 26.2, కోనరావుపేటలో 23.4, వీర్నపల్లిలో 68.0, గంభీరావుపేటలో 44.8, ముస్తాబాద్‌లో 88.7, తంగళ్లపల్లిలో 38.5, ఇల్లంతకుంటలో 18.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కోనరావుపేట మండలం నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టు వరద నీరు పెరిగింది. వీర్నపల్లి వద్ద ఒర్రెపారింది.

కేటీఆర్‌ను లక్ష మెజార్టీతో గెలిపిద్దాం

- సెస్ చైర్మన్ చిక్కాల రామారావు



ముస్తాబాద్(సిరిసిల్ల): సిరిసిల్ల నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్‌గా తీర్చిదిద్దిన మంత్రి కేటీఆర్‌ను రానున్న ఎన్నికల్లో లక్ష మెజార్టీతో గెలిపించుకుందామని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు కోరారు. ఎల్లారెడ్డిపేట, రాచర్లగొల్లపల్లి, బొప్పాపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులను గురువారం వ్యక్తిగతంగా కలుసుకున్నారు. చిక్కాల రామారావు మాట్లాడుతూ 2001 నుంచి బీఆర్ఎస్‌లో, తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. నాడు కష్టాల కోర్చి తెలంగాణ సాధనలో పనిచేశారని గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో లక్ష మెజార్టీతో గెలిపించుకోవాల్సి న అవసరం ఉందన్నారు. అందె సుభాష్, బండారి బాల్‌రెడ్డి, వరస కృష్ణహరి, రామభీమేశ్, వసంత్, ధర్మయ్య, పోచయ్య, జగన్‌రెడ్డి, పద్మారెడ్డి, లింగారెడ్డిలను వారి ఇళ్లకు వెళ్లి కలిశారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ముస్తాబాద్(సిరిసిల్ల): సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కోరారు. ముస్తాబాద్ బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. నాయకుల మధ్య విభేదాలను సమన్వయంతో పరిష్కరించుకోవాలన్నారు. సమన్వయంతో పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలోనే మంత్రి కేటీఆర్‌తో సమావేశం ఉంటుందని నాయకులకు తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు సురేందర్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ జానబాయి, భరత్, పోచయ్య, జహంగీర్, స్వామి ఉన్నారు.

నేడు శంషాబాద్‌కు బస్సు ప్రారంభం

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపో నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు డీలక్స్ బస్సును శుక్రవారం ప్రారంభించనున్నట్లు డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 4.30 గంటలకు వేములవాడ నుంచి బయలుదేరి సిరిసిల్ల, సిద్దిపేట మీదుగా రాత్రి 9 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు చేరుకుంటుందని తెలిపారు. మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి ఉదయం 9.30 గంటలకు వేములవాడ చేరుకుంటుందని తెలిపారు. ఒక్కొక్కరికి రూ.500 టికెట్ ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఇది సిరిసిల్లలోని మెహెర్‌నగర్. ఇక్కడ ఎటూ చూసిన పెద్ద.. పెద్ద భవనాలు కనిపిస్తాయి. ఆ భవనాల మధ్య ఖాళీగా ఉన్న ప్లాట్‌లో నిలిచిన మురుగునీటితో పరిసరాలు కంపు వాసన వస్తున్నాయి. దోమలు సైతం విపరీతంగా పెరిగిపోయి, సాయంత్రం అయితే చాలు ఇళ్లల్లోకి దూరుతున్నాయి.



ఇది సిరిసిల్ల మున్సిపాలిటీలోని శివారు కాలనీ రాజీవ్‌నగర్. ఈ ప్రాంతంలో పక్కా డ్రెయినేజీలు లేవు. దీంతో మురికినీరంతా ఇలా రోడ్లపైనే పారుతుంది. దుర్వాసన రావడంతోపాటు దోమలు విపరీతంగా పెరిగిపోయాయి.



ఇది వేములవాడలోని విద్యానగర్‌లోని దానిమ్మతోట ఏరియా. డ్రెయినేజీని ఇలా సగం నిర్మించి వదిలేయడంతో ఖాళీ ప్రదేశంలో మురికినీరు నిలిచి పరిసరాలు కంపు కొడుతున్నాయి. దీని గురించి పట్టించుకునే వారు లేరు. ఫలితంగా దోమలు పెరిగాయి.

దోమల మోత

- కంపు కొడుతున్న కాలనీలు
- నివాసాల మధ్య నిలుస్తున్న మురుగు
- వృద్ధి చెందుతున్న దోమలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


వేములవాడ బైపాస్ నుంచి సెస్ ఆఫీసుకు వెళ్లే దారిలో ఇలా..


వేములవాడలో నివాసాల మధ్య పిచ్చిమొక్కలు

సిరిసిల్లఅర్బన్/వేములవాడఅర్బన్: జిల్లాలోని రెండు మున్సిపాలిటీలలో అంతర్గత కాలనీలు అధ్వానంగా మారాయి. పక్కా డ్రెయినేజీలు లేక మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తుంది. ఖాళీ ప్లాట్లలో పెరిగిన పిచ్చిమొక్కలు పందులు, దోమలకు ఆవాసాలుగా మారాయి. రోడ్లపైనే పారుతున్న మురికినీటితో పరిసరాలు కంపు వాసన వస్తుండడంతో ఎవరూ కూడా బయట కూర్చునేందుకు సాహసించడం లేదు. దోమల నివారణకు ఫాగింగ్ కూడా సరిగ్గా చేయడం లేదు. దీంతో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. ఫలితంగా జనాలు విషజ్వరాల బారిన పడుతున్నారు.

39 వార్డులు.. 2 ఫాగింగ్ మిషన్లు

సిరిసిల్ల మున్సిపాలిటీలో విలీన గ్రామాలను కలుపుకొని 39 వార్డులు ఉన్నాయి. పారిశుధ్య పనుల నిర్వహణ సరిగ్గా లేదు. శివారు కాలనీల్లో డ్రెయినేజీల్లోని పూడిక సరిగ్గా తీయడం లేదు. మోరీల్లోని చెత్తను తొలగించకపోవడంతో ఎక్కడికక్కడ మురికినీరు రోడ్లపై నుంచి పారుతుంది. జిల్లా కేంద్రంలో రెండు ఫాగింగ్ మిషన్లు ఉన్నా సరిగ్గా వినియోగించడం లేదనే విమర్శలు ఉన్నాయి. మోరీలలో లార్వా వృద్ధి చెందకుండా ఆయిల్‌బాల్స్ కూడా వేయడం లేదు.

వేములవాడలో అస్తవ్యస్తం

వేములవాడ మున్సిపల్ పరిధిలోని కాలనీల్లో మురికినీరు రోడ్లపైనే ప్రవహిస్తుంది. చాలా కాలనీల్లో కనీసం నెలకోసారి కూడా డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలో 28 వార్డులు ఉండగా.. ఆయా వార్డుల్లో చెత్తను తొలగించేందుకు 6 చెత్తట్రాక్టర్లు, 20 చెత్త ఆటోలు ఉన్నాయి. కాలనీల్లో సేకరించిన చెత్తను అగ్రహారంలోని డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. ఈ చెత్తబండి కాలనీల్లోకి వారానికి రెండు సార్లు మాత్రమే వస్తుందని స్థానికులు చెబుతున్నారు. మున్సిపల్‌లో మొత్తం 142 మంది పారిశుధ్య సిబ్బంది ఉన్నారు. రెండు ఫాగింగ్ మిషన్లు ఉన్నా సరిగ్గా ఫాగింగ్ చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రాజన్న ఆలయం ఉండడంతో ఎక్కువ మంది పారిశుధ్య సిబ్బంది అవసరం. కానీ చాలీచాలని వారితోనే పనులు వెల్లదీస్తున్నారు.

సిరిసిల్ల మున్సిపల్ సమాచారం	
వార్డులు	39
పారిశుధ్య కార్మికులు	251
ఫాగింగ్ మిషన్లు	02

వేములవాడ మున్సిపల్ సమాచారం	
వార్డులు	28
పారిశుధ్య సిబ్బంది	142

దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలి



జిల్లా కేంద్రంలో దోమల బెడద ఎక్కువగా ఉంది. సాయంత్రం వేళ బయట నిలబడలేని పరిస్థితి ఉంది. వర్షాకాలం కావడంతో ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ ఉండడం, డ్రెయినేజీ పారక దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంది. అధికారులు దోమలను నివారించేందుకు చర్యలు చేపట్టాలి. – అబ్దుల్ రఫీక్, సిరిసిల్ల

ఫాగింగ్ చేయిస్తున్నాం



దోమల నివారణ చర్యలు చేపడుతున్నాం. వార్డుల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయిస్తున్నాం. డ్రెయినేజీల్లో బ్లీచింగ్ చల్లుతున్నాం. దోమల లార్వా వృద్ధి చెందకుండా డ్రెయినేజీల్లో ఆయిల్‌బాల్స్ వేస్తున్నాం. – సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిరిసిల్ల మున్సిపాలిటీ

రోడ్లపైనే మురికినీరు



వేములవాడ రెండో బైపాస్ నుంచి సెస్ ఆఫీస్‌కు వెళ్లే దారిలో మురికి కాలువను రోడ్డు వరకు నిర్మించి వదిలేశారు. దీంతో మురికినీరు రోడ్డుపై పారుతుంది. ఇంటి ముందు కొస్తే దోమలతో ఇబ్బందిగా ఉంది. – గడ్డం నవీన్, వేములవాడ

డ్రెయినేజీలు శుభ్రం చేయాలి



తిప్పాపూర్‌లోని డ్రెయినేజీలను నెలకోసారి కూడా శుభ్రం చేయకపోవడంతో దోమలతో ఇబ్బంది పడుతున్నం. ఫాగింగ్ కూడా చేయడం లేదు. అధికారులు పట్టించుకొని వర్షాకాలంలో వారానికి రెండుసార్లు ఫాగింగ్ చేయాలి. – శ్రీనివాస్, తిప్పాపూర్



తల్లిదండ్రుల సహాయంతో వాగుదాటుతున్న విద్యార్థులు

వాగు దాటితేనే స్కూల్‌కు..

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయానికి వెళ్లాలంటే తూకమర్రెవాగు దాటాల్సిందే. బుధవారం అర్ధరాత్రి తర్వాత కురిసిన వర్షానికి వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గురువారం స్కూల్‌కు వెళ్లే విద్యార్థినులు వాగు దాటేందుకు ఇబ్బంది పడ్డారు. తల్లిదండ్రుల సహాయంతో వాగు దాటి స్కూల్‌కు వెళ్లారు. ఇప్పటికైనా మంత్రి కేటీఆర్ స్పందించి తూకమర్రెవాగుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కొండా లక్ష్మణ్ జీవితం పేదలకు అంకితం



సిరిసిల్లకల్చరల్: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికే అంకితం చేశారని గ్రంథాలయసంస్థ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య కొనియాడారు. గురువారం లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా కేంద్ర గ్రంథాలయ భవనంలో నివాళి అర్పించారు. లైబ్రేరియన్ మల్లయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించాలి



సిరిసిల్లఅర్బన్: అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ బీపీ, షుగర్, బ్రెస్ట్, గర్భాశయ క్యాన్సర్ తదితర అసంక్రమిత వ్యాధులు ఉన్న వారిని గుర్తించి, ఎన్‌సీడీ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

- గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట భద్రత
- ఎస్పీ అఖిల్ మహాజన్


మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన బందోబస్తుకు సిద్ధంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఆరు చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై స్పష్టత ఉండాలన్నారు. రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చి, బెల్ట్‌షాపులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

నేరాల నియంత్రణకు దర్యాప్తు కీలకం

పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పీడీయాక్ట్ పెట్టాలన్నారు.

నవరాత్రులకు పటిష్ట భద్రత

గణేశ్ ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి గణేశ్ మండపాన్ని జియోట్యాగింగ్ చేయాలని సూచించారు. మెరుగైన సేవలందించిన 22 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచాలి


- గర్భిణులతో మర్యాదగా మాట్లాడాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి


సిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రసూతి సేవలను మరింత విస్తరించేందుకు 'మాతృసేవ' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రికొచ్చే గర్భిణులతో మర్యాదతో మాట్లాడి అవసరమైన అన్ని వైద్యసేవలు అందించాలన్నారు. అప్పుడే ప్రభుత్వ వైద్యసేవలపై మరింత నమ్మకం పెరుగుతుందన్నారు. ఆస్పత్రిలో ఔట్ పేషెంట్ కౌంటర్ వద్ద ఎలక్ట్రానిక్ టోకెన్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గర్భిణులు వేచి ఉండే హాలు ఇరుకుగా ఉందని, విస్తరించాలని సూచించారు. రిపోర్టుల కోసం వేసి చూసేందుకు ఆక్సిజన్ ప్లాంటు వైపు తాత్కాలిక షెడ్డు వేయాలని ఆదేశించారు. అన్ని వార్డుల్లో లైటింగ్ పెంచాలని, లైటింగ్‌తో కూడిన సూచికల బోర్డులను అమర్చాలన్నారు. ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ మురళీధర్‌రావు, మున్సిపల్ కమిషనర్ ఆయాజ్, వైద్యులు ఉన్నారు.

అతివల ఆనందం

- మహిళా బిల్లుతో రాజకీయాల్లో స్త్రీలకు అవకాశాలు మెరుగు
- చట్టసభల్లో పెరుగనున్న ప్రాతినిధ్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న పలు రంగాల మహిళలు
- వెంటనే అమలు చేయాలని డిమాండ్



సిరిసిల్లకల్చరల్/తంగళ్లపల్లి/ముస్తాబాద్(సిరిసిల్ల): చట్టసభల్లో మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ల అంశం ఏళ్లుగా అమలుకు నోచుకోలేదు. ఎట్టకేలకు నూతన పార్లమెంట్ భవనంలో ప్రవేశపెట్టిన మహిళాబిల్లుకు ఆమోదం లభించింది. ఈ బిల్లు ఆమోదంతో రాజకీయాల్లో స్త్రీలకు 33 శాతం రిజర్వేషన్లు వర్తించనున్నాయి. దీంతో చట్టసభల్లో అధిక సంఖ్యలో స్త్రీల ప్రవేశానికి అవకాశం లభించింది. అయితే వెంటనే అమలు చేయాలని పలువురు మహిళా నాయకులు కోరుతున్నారు. ఇన్నాళ్లు ఎదురుచూసిన వారు ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూనే వెంటనే అమలు చేయాలని కోరుతున్నారు.

చరిత్రాత్మక సందర్భం



ఏళ్లుగా నిరీక్షిస్తున్న మహిళా బిల్లును కేంద్రం ఆమోదించడం చరిత్రాత్మక సందర్భం. ఈ విషయంలో అలుపు లేని పోరాటం చేసిన మహిళలందరికీ శుభాకాంక్షలు. కుటుంబాన్ని ముందుకు తీసుకెళ్లే సత్తా ఉన్న మహిళలకు దేశ వ్యవస్థను సైతం నడిపించగల సామర్థ్యం ఉంది. బిల్లు ఆమోదంతో మహిళల శక్తి సామర్థ్యాలు మరింత వెలుగులోకి రానున్నాయి. – న్యాలకొండ అరుణ, జెడ్పీ చైర్‌పర్సన్

మహిళల అభివృద్ధికి అవకాశం



మహిళలు అన్ని రంగాల్లో పురోగమిస్తున్న ప్రస్తుత తరుణంలో చట్టసభల్లోనూ అతివలకు రిజర్వేషన్లు కల్పించడం అరుదైన అవకాశం. బిల్లు ఆమోదించే విషయంలో బీఆర్ఎస్ కూడా తన సహకారాన్ని అందించింది. గతంలో ఇదే విషయమై పోరాటాలు చేసింది. మహిళలు స్వయంశక్తితో ఎదిగేందుకు శాసన నిర్ణయాలు చేసేందుకు దోహదం చేస్తుంది. – జిందం కళ, మున్సిపల్ చైర్‌పర్సన్

అణగారిన వర్గాలకు అందాలి



కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి మహిళా బిల్లుపై ఉన్న శ్రద్ధ మరే పార్టీకి లేదు. అత్యున్నత రాష్ట్రపతి, ఆర్థికమంత్రి పదవులను మహిళలకు ఇచ్చి చిత్తశుద్ధి చాటుకుంది. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మహిళా బిల్లును సైతం ఆమోదించింది. అణగారిన వర్గాల మహిళలకు రిజర్వేషన్ ఫలాలు అందేలా బిల్లు రూపొందితే మరింత బాగుంటుంది. – బర్కం లక్ష్మి, పెద్దూరు సింగిల్‌విండో మాజీ చైర్‌పర్సన్

అభినందనీయం



మూడు దశాబ్దాలకు పైగా సాగుతున్న పోరాటం ఫలించింది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మహిళా బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. ఏదేమైనా మహిళా బిల్లు కార్యరూపం దాల్చడం అభినందనీయం. – కాముని వనిత, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు

మహిళా శక్తి తెలుస్తుంది



స్వాతంత్య్రం సిద్ధించి 75 ఏళ్లు గడుస్తున్న సందర్భంగా మహిళా సాధికారితకు తొలి అడుగు పడడం సంతోషం. ఈ బిల్లుతో దేశంలోని రాజకీయ అవకాశాలు దక్కి మహిళా శక్తి అంటే ఏంటో తెలుస్తుంది. – పడిగెల మానస, ఎంపీపీ తంగళ్లపల్లి

రిజర్వేషన్లతో మెరుగైన అవకాశాలు



చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా రాజకీయాల్లో మహిళలకు మెరుగైన అవకాశాలు లభిస్తాయి. చట్టసభల్లో రిజర్వేషన్లు కోరుతున్న మహిళలకు మంచి అవకాశం. చట్టాల తయారీలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉంది. – ఎరవెల్లి అనురాధ, డాక్టర్, ముస్తాబాద్

క్లుప్తంగా

జీవన నైపుణ్యాలపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

గంభీరావుపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న అన్ని విభాగాల విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. వారం రోజులపాటు శిక్షణ కొనసాగనుంది. స్కిల్ ఓరియెంటేషన్‌లో భాగంగా 50 మంది విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. కమ్యూనికేషన్, ఇంటర్వ్యూ స్కిల్స్, రెజ్యూమ్ వంటి అంశాలపై సూచనలు చేస్తున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, శిక్షకులు తిరుపతిగౌడ్, శంకరన్, ప్రకాశ్, హబీబ్, వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధర్మపురి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

సిరిసిల్లఅర్బన్: గంభీరావుపేట మండల కేంద్రంలో బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కోరారు. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. గంభీరావుపేట మండలంలో బీసీ హాస్టల్ లేక విద్యార్థులు అడ్మిషన్లు రద్దు చేసుకుంటున్నారని తెలిపారు. కేజీ టు పీజీ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే హాస్టల్ ఏర్పాటు చేసి, జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. నాయకులు అక్కెం నాగరాజు, ప్రకాశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహిళలకు సబ్ కోటా ప్రకటించాలి



మాట్లాడుతున్న రవి

సిరిసిల్లఅర్బన్: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులో బీసీల వాటా తేల్చాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం సిరిసిల్లలోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టసభల్లో బీసీ మహిళలకు సబ్ కోటా ప్రకటించాలన్నారు. లేకపోతే బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చెపడుతామని హెచ్చరించారు. నాయకులు రాకేశ్, ధనుష్, సంజయ్ తదితరులున్నారు.

ఏఐఎఫ్‌బీ జిల్లా అధ్యక్షుడిగా కమలాకర్



కమలాకర్

సిరిసిల్ల: ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) జిల్లా అధ్యక్షుడిగా మేకల కమలాకర్‌ను రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ కటుకం మృత్యుంజయం నియమించారు. తనను నియమించిన మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయంకు కమలాకర్ గురువారం కృతజ్ఞతలు తెలిపారు.

నాడు కూలీలు నేడు యజమానులు



పొలంలో నాట్లు వేసుకుంటున్న లబ్ధిదారులు



ప్రభుత్వం ఇచ్చిన భూమిని చూపుతున్న రాజయ్య

- భూపంపిణీతో నెరవేరిన దశాబ్దాల కల
- 36 మందికి 88.31 ఎకరాలు అందజేత
- పనిచేసిన పల్లెల్లోనే సొంతంగా పంటల సాగు
- తలెత్తుకొని జీవిస్తున్న దళితులు

ఈమె తంగళ్లపల్లి రాజవ్వ. ఎల్లారెడ్డిపేట మండలం సింగారం. కూలి పనులు చేసే రాజవ్వకు ప్రభుత్వం మూడెకరాలు అందించింది. ఆ భూమిని సాగుచేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తుంది. రైతుబంధు ద్వారా పంట సాయం సైతం అందింది.



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తెల్లవారితే కూలి పనులు వెతుక్కుంటూ వెళ్లే వ్యవసాయ కూలీలు నేడు దర్జాగా సొంత భూముల్లో సాగు పనులు చేసుకుంటున్నారు. వ్యవసాయ పనులకు కూలీలుగా వెళ్లిన వారు.. యజమానులు ఏయే పంటలు సాగు చేయాలో చర్చించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దళితులకు మూడెకరాల భూపంపిణీతో వారి జీవితాల్లో వెలుగులు నిండాయి. జిల్లాలో గత నాలుగేళ్లలో 36 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం 88.31 ఎకరాలను పంపిణీ చేసింది. ప్రస్తుతం వారంతా ఆ భూముల్లో పంటలు సాగు చేసుకొని సంతోషంగా ఉంటున్నా రు. ఎల్లారెడ్డిపేట మండలం సింగారంలో ఐదుగురికి,దుమాలలో ముగ్గురికి భూ పంపిణీ చేశారు.

36 కుటుంబాలకు జీవనోపాధి

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దళితులకు మూడెకరాల భూపంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద స్వగ్రామాల్లోనే మూడెకరాల చొప్పున అందజేసింది. 2018 ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని అప్పటి కలెక్టర్ కృష్ణభాస్కర్ చేతులమీదుగా పట్టాలను అందజేశారు. జిల్లాలోని 13 మండలాల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేద దళిత కుటుంబాలను మొదట ఎంపిక చేసింది. నాలుగేళ్లలో 36 కుటుంబాలకు 88.31 ఎకరాల భూములను పంపిణీ చేసింది. ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో ప్రస్తుతం లబ్ధిదారులు వరి, పత్తి, కూరగాయల పంటలు వేసుకుంటూ తలెత్తుకొని బతుకుతున్నారు. అంతేకాకుండా రైతుబంధు ద్వారా లబ్ధిదారులకు మూడెకరాలకు రూ.30వేల చొప్పున పెట్టుబడి సాయం అందుతుంది.

నెరవేరిన దశాబ్దాల కల

కూలీలుగానే జీవితం ముగుస్తుందనుకున్న వారి జీవితాల్లో ప్రభుత్వ నిర్ణయంతో ఏళ్ల కల నెరవేరింది. జిల్లా వ్యాప్తంగా మరో 150 మంది వరకు సెంటు భూమిలేని నిరుపేదలు భూమి కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా ఇటీవల సిరిసిల్లకు వచ్చిన మంత్రి కేటీఆర్‌ను కలిసి తమకు భూములు అందించాలని వేడుకున్నారు. మంత్రి సానుకూలంగా స్పందించి అర్హులకు మూడెకరాల భూమి అందుతుందని భరోసానిచ్చారు. దళితులకు మూడెకరాల భూమి పథకంతో గల్ఫ్ దేశాలు, ఇతర పట్టణాలకు బతుకుదెరువు కోసం వెళ్లిన వారు సైతం స్వగ్రామాలకు వచ్చి వ్యవసాయం చేసుకుంటున్నారు.

ఏ ప్రభుత్వమూ ఆలోచించలేదు



ఇన్నాళ్లలో ఏ ప్రభుత్వమూ దళితులకు భూములు ఇవ్వాలని ఆలోచన చేయలేదు. కూలీనాలీ చేసుకునే వాళ్లం. గుంటెడు భూమి లేక తాతల కాలం నుంచి కూలీ పనులకు వెళ్లేవాళ్లం. మా అవ్వ రామవ్వ పేరు మీద ప్రభుత్వం మూడెకరాలు భూమి కొనిచ్చింది. ఆ భూమిలో వరి వేసుకున్నాం.

– సోమారపు శరవింద్, దుమాల

అర్హులను గుర్తిస్తాం



దళితులకు మూడెకరాల భూపంపిణీలో భాగంగా అర్హులను గుర్తిస్తాం. దరఖాస్తుల ఆధారంగా గుంటెడు భూమిలేని వారికే ఈ పథకం వర్తిస్తుంది. గతంలో మండలంలోని రెండు గ్రామాల్లో ఎలాంటి భూమి లేని ఎనిమిది మందికి మూడెకరాల చొప్పున పంపిణీ చేశాం. ప్రభుత్వ ఆదేశాలతో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు సేకరిస్తున్నాం.

– జయంత్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్, ఎల్లారెడ్డిపేట

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

- కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ



ప్రజలకు కాంగ్రెస్ మేనిఫెస్టో వివరిస్తున్న కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట(మానకొండూర్): కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమని కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని చింతలకుంటపల్లిలో గురువారం గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు సంక్షేమ పథకాలు అందని ద్రాక్షగానే మిగిలాయని, కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో సీఎం కేసీఆర్ కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. కాళేశ్వరం నీటితో మండలంలోని ఒక్క ఎకరం కూడా పారడం లేదన్నారు. సీఎం కేసీఆర్ మాయమాటలతో ప్రజలను మభ్య పెట్టడమే తప్ప చేసిందేమి లేదని విమర్శించారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మానకొండూర్ నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేయలేదన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య, ఎంపీటీసీలు స్వప్న కర్ణాకర్‌రెడ్డి, సుమలతమల్లేశం, అంతగిరి వినయ్‌కుమార్, కేశవరెడ్డి, బాలపోచయ్య ఉన్నారు.

ఆక్వా హబ్ ఘనత మంత్రి కేటీఆర్‌దే

- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మాండ్లు



చేప పిల్లలను వదులుతున్న హన్మాండ్లు

గంభీరావుపేట(సిరిసిల్ల): సిరిసిల్ల మిడ్‌మానేరు వద్ద ఆక్వా హబ్ ఏర్పాటు చేసిన ఘనత మంత్రి కేటీఆర్‌దేనని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు. గంభీరావుపేట మండలంలోని శ్రీగాధ చెరువులో గురువారం లక్ష చేప పిల్లల విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆక్వా హబ్ వల్ల మత్స్యకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మంత్రి కేటీఆర్ కృషితో సిరిసిల్ల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఆయనను భారీ మెజార్టీతో గెలిపిస్తామని పేర్కొన్నారు. సిరిసిల్లకు అపెరల్ పార్క్, నర్సింగ్ కళాశాల, అగ్రికల్చర్ కళాశాల, జేఎన్‌టీయూ, కేజీ టు పీజీ, మెడికల్ కళాశాలలు తెచ్చారని తెలిపారు. ముదిరాజ్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పర్శ శ్రీనివాస్, సభ్యులు నర్సింలు, రవి, నారాయణ, కాశీ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై అంగన్‌వాడీల నిరసన



నిరసన తెలుపుతున్న టీచర్లు, ఆయాలు

సిరిసిల్లటౌన్: అంగన్‌వాడీల నిరవధిక సమ్మె గురువారం 11వ రోజుకు చేరింది. సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్ ఎదుట మోకాళ్లపై కూర్చొని, నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఉద్యోగ, ఆరోగ్య భద్రత తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల సంఘం జిల్లా అధ్యక్షురాలు కల్లూరి చందన, ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత, కోశాధికారి పద్మ, శ్యామల, పద్మ, అంజలి, మంగ, వాణి, రమ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి ఆశవర్కర్ల నిరవధిక సమ్మె



సమ్మె నోటీసు ఇస్తున్న ఆశవర్కర్లు

సిరిసిల్లటౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశవర్కర్లు ఈ నెల 25 నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన నోటీసును సిరిసిల్ల తహసీల్దార్‌కు గురువారం అందజేశారు. తమకు కనీస వేతనం రూ.18 వేలు అమలు చేసి, సమస్యలు పరిష్కరించాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, చంద్రకళ, నిర్మల, లావణ్య, స్వప్న, లక్ష్మి, పద్మ, గీత తదితరులున్నారు.

కొనసాగుతున్న 'మధ్యాహ్న' కార్మికుల సమ్మె



నిరసన తెలుపుతున్న కార్మికులు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికుల చేపడుతున్న సమ్మె గురువారం రెండోరోజు కొనసాగింది. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పంతం రవి మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ మరిచిపోయారని విమర్శించారు. వారిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఏడు నెలలుగా బిల్లులకు రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తె లి పా రు.ఇప్పటికైనా హామీలను నెరవేర్చాలని కోరారు.

సాగులో సాంకేతికతను ఉపయోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డా.మదన్ మోహన్

రుద్రంగి(వేములవాడ): వ్యవసాయంలో సాంకేతికతను ఉపయోగించుకొని లాభాలబాట పట్టాలని జిల్లా ఏరువాక కేంద్రం కరీంనగర్ కో–ఆర్డినేటర్ మదన్‌మోహన్ కోరారు. మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఏరువాక కేంద్రం కరీంనగర్ కో–ఆర్డినేటర్ మదన్‌మోహన్ మాట్లాడుతూ వాతావరణ సంబంధిత విషయాలను.. చీడపీడల యాజమాన్య, మార్కెట్ సంబంధిత అంశాల గురించి ఉన్న చోటు నుంచే మొబైల్‌ను ఉపయోగించుకోవాలన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ప్రసారమవుతున్న పీజేటీఎస్ఏయూ–అగ్రికల్చర్ వీడియోస్ పేరుతో ఉన్న యూట్యూబ్ చానల్, చేను కబుర్లు అను రేడియో కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, రావెప్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిల నియామకం

కరీంనగర్‌క్రైం: ఇటీవల నూతనంగా నియామకమైన 39 మంది జూనియర్ సివిల్ జడ్జిలను రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న కోర్టుల్లో నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నియామకాల్లో భాగంగా ఉమ్మడి జిల్లాల్లోని 9 కోర్టులకు వీరిని కేటాయించింది. నంది మేడారం జూనియర్ సివిల్ జడ్జిగా నల్లాల వెంకట సచిన్‌రెడ్డి, హుజురాబాద్ ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా పద్మశాయి శ్రీ, కోరుట్ల జూనియర్ సివిల్ జడ్జిగా కాసుల్ల పావని, రాజన్న సిరిసిల్ల అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా కావేటి సజన, కరీంనగర్ స్పెషల్ ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్‌గా బానోత్ రాజేశ్వర్, కరీంనగర్ ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా దామెర్ల ప్రీతిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హుజురాబాద్ ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న పాలడుగు అలేఖ్యను అక్కడే ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. సిరిసిల్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు ముదావత్‌ను రంగారెడ్డి మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టుకు బదిలీ చేయగా, ఈస్థానంలో నాగర్ కర్నూల్ ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ అరవను నియమించారు. వీరంతా అక్టోబర్ 4వ తేదీలోపు జాయిన్ కావాలని ఉత్తర్వుల్లో సూచించారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

గంభీరావుపేట(సిరిసిల్ల): చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి వ్యక్తి మృతిచెందిన సంఘటన నాగంపేటలో గురువారం జరిగింది. బొంది రాజయ్య(50) గ్రామ సమీపంలోని చెరువులో చేపలు పట్టడానికి బుధవారం రాత్రి వలలు వేసి, వచ్చాడు. గురువారం ఉదయం వలలు తీసేందుకు చెరువులోకి దిగి, నీటిలో మునిగి మృతిచెందాడు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల దీక్షల విరమణ

సిరిసిల్లఅర్బన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు కొన్ని రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలను విరమిస్తున్నట్లు తెలిపారు. గురువారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తుందన్న నమ్మకంతో తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజేందర్, దేవేందర్, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

'రాజన్న నిధుల మళ్లింపు సరికాదు'



మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్



సమావేశమైన జేఏసీ, ప్రతిపక్షాల నాయకులు

వేములవాడ: రాజన్న ఆలయానికి సంబంధించిన రూ.5 కోట్లను కామారెడ్డికి మళ్లించడం సరైంది కాదని, భక్తులు వేసిన డబ్బులపై సీఎం కేసీఆర్ కన్నేయడం విడ్డూరంగా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. దీనికి నిరసనగా ఈ నెల 23న వేములవాడ పట్టణ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం స్థానిక భీమేశ్వర గార్డెన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కామారెడ్డి అసెంబ్లీ స్థానం నుంచి కేసీఆర్ పోటీ చేస్తున్నట్లు ప్రకటించి, ఆలయాలపై రాజకీయాలు చేయడం దుర్మార్గమన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలోని పలు దేవాలయాలకు వేములవాడ ఆలయం నుంచి రూ.5 కోట్లు, యాదాద్రి ఆలయం నుంచి రూ.5 కోట్లు విడుదల చేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ ఉత్తర్వులు వెలువరించడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాజన్న సన్నిధిలో భక్తులు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతుంటే సీఎంకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. 2015లో సీఎం హోదాలో వేములవాడ వచ్చి, ఏటా రూ.100 కోట్ల చొప్పున బడ్జెట్‌లో కేటాయించి, ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పి, ఇప్పటివరకు నయాపైసా ఇవ్వలేదన్నారు. జీవోను వెంటనే రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు రేగుల మల్లికార్జున్, సంటి మహేశ్, జక్కుల తిరుపతి, అన్నారం శ్రీనివాస్, రామతీర్థపు హరీశ్, శ్రీనివాస్, సత్యం తదితరులున్నారు.

రాజన్న ఖజానాపైనే కన్నేసిన ఘనుడు

నా లగ్గం ఎములాడ రాజన్న చెంతనే జరిగింది.. నేను ఏటా రాజన్నకు రూ.100 కోట్లు కేటాయిస్తానని గుడి మెట్లపై ప్రకటించిన సీఎం కేసీఆర్ నిధులు కేటాయించకపోగా స్వామివారి ఖజానాపైనే కన్నేసిన ఘనుడని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. ఈ ఆలయానికి సంబంధించిన రూ.5 కోట్లను కామారెడ్డి ప్రాంతంలోని ఆలయాలకు తరలించడాన్ని అడ్డుకుంటామన్నారు. వేములవాడ బంద్‌కు పిలుపునిస్తున్నామని, జీవో వెనక్కి తీసుకునేవరకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసనలు తెలుపుతామని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు గుడి మెట్ల ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటాన్ని దహనం చేశారు. నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, పిల్లి కనకయ్య, చిలుక రమేశ్, పాత సత్యలక్ష్మి, భారతి, కనికరపు రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

23న బంద్‌కు సహకరించాలి

వేములవాడ ఆలయ నిధులను కామారెడ్డి ఆలయాలకు మళ్లించాలన్న నిర్ణయానికి నిరసనగా ఈ నెల 23న వేములవాడ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు జేఏసీ నాయకులు నేరెళ్ల తిరుమల్‌గౌడ్, బొజ్జ కనకయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, బీజేపీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, టీడీపీ రాష్ట్ర నాయకుడు పులి రాంబాబు, బీఎస్పీ నాయకుడు నాగరాజు, సీపీఐ నాయకుడు కదారి రాములు, సీపీఎం నాయకుడు ముక్తికాంత అశోక్, ప్రజలు సహకరించాలని కోరారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



ఎన్‌క్వాస్ బృందం సభ్యులు, వైద్యసిబ్బంది

బోయినపల్లి(చొప్పదండి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎన్‌క్వాస్ బృదం సభ్యులు డాక్టర్ సుమన్ వశిష్ట్, డాక్టర్ అజయ్‌శర్మ సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో రెండో రోజు గురువారం తనిఖీలు చేపట్టారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రోగుల విషయంలో శ్రద్ధ తీసుకోవాలన్నారు. డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, అదనపు ఆరోగ్యశాఖ అధికారి శ్రీరాములు, డీపీవో ఉమ, పీహెచ్‌సీ వైద్యాధికారిణి అనిత, జిల్లా క్వాలిటీ మేనేజర్ విద్యాసాగర్, సూపర్‌వైజర్ శ్రీనివాస్ ఉన్నారు.

గుండెపోటుతో జీపీ కార్మికుడి మృతి



కొండయ్య (ఫైల్)

ముస్తాబాద్: ఎల్లారెడ్డిపేట మండలంలోని సింగారం గ్రామ పంచాయతీ కార్మికుడు బొమ్మిడి కొండయ్య గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. పదేళ్లుగా పంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్న కొండయ్య గురువారం ఉదయం విధులకు వెళ్లేందుకు ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. ఒక్కసారిగా గుండెలో నొప్పి అంటూ కిందపడిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. ఉత్తమ పంచాయతీ కార్మికుడిగా కొండయ్య గ్రామానికి అనేక సేవలందించాడని సర్పంచ్ మంగోళి నర్సాగౌడ్ అన్నారు. కొండయ్య మృతితో అతని భార్య పుష్ప, కుమారుడు, కుమార్తెల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సర్పంచ్ నర్సాగౌడ్, ఉపసర్పంచ్ ఉస్మాన్ పరామర్శించారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి



మంత్రి కేటీఆర్ పీఎస్ శ్రీనివాస్‌తో జెడ్పీటీసీ, సర్పంచ్‌లు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆయా గ్రామాల సర్పంచులు మంత్రి పీఎస్ శ్రీనివాస్, అదనపు పీఎస్ గడ్డం శ్రీనివాస్‌కు గురువారం విన్నవించారు. జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో మండల సర్పంచులు గురువారం ప్రగతిభవన్‌కు వెళ్లి, వినతిపత్రం అందించారు.

ఎన్నికల బందోబస్తుకు వసతి పరిశీలన



రైతువేదిక వద్ద ఏఆర్ డీఎస్పీ తదితరులు

బోయినపల్లి(చొప్పదండి): రానున్న అసెంబ్లీ ఎన్నికల బందోబస్తులో భాగంగా బెటాలియన్ జవాన్ల వసతి కోసం మండల కేంద్రంలోని రైతువేదిక భవనాన్ని గురువారం ఏఆర్ డీఎస్పీ విజయేందర్‌రెడ్డి, ఆర్ఐ రమేశ్ పరిశీలించారు. సుమారు వంద మందితో కూడిన బెటాలియన్ ఎన్నికల బందోబస్తు చేపడుతుందని డీఎస్పీ తెలిపారు. ఎస్సై మామిడి మహేందర్ తదితరులు ఉన్నారు.

పొలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారి జగ్గారావుపల్లె శివారులోని పొలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గురువారం ఉదయం గుర్తించారు. విషయం తెలుసుకున్న సీఐ ఉపేందర్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించి, పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, హత్యనా, లేక ప్రమాదం వల్ల జరిగిందా అనే కోణంలో విచారణ చేపడుతున్నట్లు సీఐ పేర్కొన్నారు. మృతుడి వయసు 50 ఏళ్లపైబడి ఉంటుందని, ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.